UNIVERSAL LIBRARY
OU_204612
UNIVERSAL LIBRARY

KHADARIA BOOK BINDING WORKS
Opp : King Kothi Post Office,
Hyderabad-500 001.

విరిసెజ్జ

మండపాక పార్వతీశ్వరశాస్త్రి గారు

సర్వస్వామ్యములు
గ్రంథకర్తవి :

శ్రీ అద్దేపల్లి లక్ష్మణస్వామి నాయుడుగారిచే
రాజమండ్రి సరస్వతీ పవర్ ప్రెస్ నందు ముద్రితము_9158_1000_1935

[వెల రు. 0—8—0

ఉపోద్ఘాతము

ఇటీవల నాధ్యాత్మిక కవిత్వము రవీంద్రనాధ ఠాకూరు గారితో కూడ ప్రాముఖ్యమునకు వచ్చినది. ఠాకూరు, మహాకవి గీతాంజలి ప్రకటించినాడు. ఆ గ్రంథము పాశ్చాత్యుల పొగడ్తలకు లోనయినది. దానివల్లనే ఠాకూరు కవి నోబెల్ బహుమానము సంపాదించి నాడు.

అంతటి ప్రతిష్ఠను గీతాంజలి సంపాదించుటచేత తెలుగులో కూడ కొన్ని ఆధ్యాత్మిక కవిత్వగ్రంథ ములు బయలుదేరినవి. కాని ఈగ్రంథములను గురించి విమర్శలు యింకను వెలువడలేదు. కాన వాటి మంచి చెడ్డలను గురించి మనమేమియు చెప్పజాలము.

గీతాంజలిలో ఠాకూరు మహాకవి భగవంతుని యందు తనకుగల ప్రేమ, భక్తి వెలిబుచ్చినాడు. ఆ గ్రంథములో దృశ్యములవంటివి అనేకములు వర్ణింప బడినవి. ఆదృశ్యముల వంటివి అన్నియు ఠాకూరు గారి భావనయే. అవి భావనయే గాని నిజముగావని తెల్పుటకు గీతాంజలియే సాక్ష్యము. ఠాకూరుగారు

తాము భగవంతుని సందర్శించియుండలేదని గీతాంజలిలోనే స్పష్టముగా చెప్పియున్నారు. ఆ అంశమును తెలియజేయు భాగములు గీతాంజలి (ఆదిపూడి సోమనాధరావుగారి యనువాదము) నుండి యుదహరించెదను.

నాకుఁ బరమావధివి గాననాథ ! నిన్నుఁ
గరము మెలఁకువ నొక్కమాఱరయుచుందు ;
మెలఁకువను దక్కయొకమాఱు మెలఁగుచుందుఁ ;
గాని నీవేలొకోదాఁగి కానరావు.

(౧౮ వ గీతము)

దేవ ! నిన్గాంచు భాగ్య మీ జీవితమున
నేను గనఁజాలనేని యో దీనరక్ష !
“తప్పితిని నీదుదృష్టికి దప్పితి” నని
యెప్పుడును నాదుమదిలోన నెంచనిమ్ము.
ఒక్కక్షణమైన మఱవకయుండ నిమ్ము.
స్వప్నజాగ్రదవస్థలస్వామి ! నేను
దారుణంబగు నీచింతఁదాల్పనిమ్ము.

(౭౯ వ గీతము)

ఠాకూరుగారికి ఈశ్వరసాక్షాత్కారము లేదను టకుగాను తెలుపబడిన అంశములు అవి.

శ్రీ మండపాక పార్వతీశ్వరశాస్త్రిగారు 'పాలవెల్లి,' 'తేనెపట్టు' అను రెండు ఖండకావ్యసంపుటములు ఈ మధ్య ప్రకటించినారు. ఈ సంపుటములు చదువు భాగ్యము నాకు గలిగినది. కవిగారిని కావ్యముల ద్వారా యెరిగినాను. వారి కవిత్వమును చదివి ఆనం దించి వాటిపై నొక పెద్దవిమర్శ వ్రాసి 'ఉషస్సు' పత్రి కలో ప్రకటించినాను. ఆ వ్యాసమును కవిగారుకూడ చూడ తటస్థించినది. వారు ఆ విమర్శను మెచ్చు కొన్నారు. అట్లు మెచ్చుకొనుటకు కారణము ఆ విమ ర్శలోని గుణముగాక వారి ఔదార్యమనియే నేను తలచుచున్నాను.

శ్రీ పార్వతీశ్వరశాస్త్రిగారు తమ రెండుగ్రంథము లలోను ఆధ్యాత్మిక కవిత్వము రచించినారు. ఠాకూరు గారుకూడ గీతాంజలిలో ఆధ్యాత్మిక కవిత్వమే రచిం చినారని అందరు ఎరిగిన సంగతే. కాని శ్రీ పార్వతీశ్వ రశాస్త్రిగారి ఆధ్యాత్మిక కవిత్వము ఠాకూరుగారి ఆధ్యాత్మిక కవిత్వముకంటె భిన్నము. ఠాకూరుగారు

తమ గ్రంథములో తాము జూడనటువంటి భగవంతుని పై తమకు గల ప్రేమ, భక్తి వర్ణించినారు. పార్వతీశ్వరశాస్త్రిగారో! వారు భగవంతుని మాతృరూపమున గొల్చి సాక్షాత్కరింపజేసికొని, అద్వైతసిద్ధిని పొంది, సమాధిదశలలో తమకు కలిగిన దృశ్యములలో కొన్నిటిని తమ కావ్యములలో వర్ణించినారు. కవిగారు ఆదృశ్యములతో బాటు తమ జీవితమందలి కొన్ని దశలను కూడ వర్ణించినారు.

శ్రీ పార్వతీశ్వరశాస్త్రిగారు మానవుడు పొందవలసిన ఉత్తమస్థితిని అనగా ఈశ్వరసాక్షాత్కారమును పొందినారు. అట్టిస్థానమును పొందినవారు ఈ ప్రపంచములో చాల అరుదు. ఆ పొందిన కొద్దిమంది లోను తమ అనుభవములను ఇతరులకు జెప్పెడివారు మిక్కిలి తక్కువ. ఆ చెప్పెడివారిలోనైన కవులు బొత్తిగా తక్కువ. భారతదేశముయొక్క అదృష్టము వల్ల శ్రీ పార్వతీశ్వరశాస్త్రిగారు ఒక్క ఋషులేగాక మహాకవులు కూడా. వారు భగవంతునితో తమకు కలిగిన అనుభవములను అద్భుతమైన కవిత్వములో మనకు తెలియజేసినారు.

శ్రీ మండపాక పార్వతీశ్వరశాస్త్రిగారు *'విరిసెజ్జ' అను ఈ గ్రంథమును ప్రకటించుచున్నారు. ఈ గ్రంథ కూడ పై రెండిటివలెనే ఆధ్యాత్మిక కవిత్వముగలది. ఇదికూడ వాటివలె ఉత్తమమైన గ్రంథము.

విరిసెజ్జలో నైదు ఖండకావ్యములున్నవి. రెండవ ఖండకావ్యములో కవిగారు భార్యయొక్క మరణము, కష్టములు, రెండవవివాహము గురించి వ్రాసినారు. మూడవ ఖండకావ్యములో భౌతికస్థానాపేక్ష, ఈశ్వరీ దర్శనము గురించి చెప్పినారు. నాల్గవదానిలో సమాధిలోని దృశ్యము, అయిదవదానిలో భౌతికస్థానాపేక్ష, కష్టములు, ఈశ్వరీదర్శనము వర్ణించినారు. (ఈఖండ కావ్యములలో 'అమ్మ,' 'ఆత్మేశ్వరి' అను పదములకు 'ఈశ్వరి' అని అర్థము చేసికొనవలెను.)

శ్రీ శాస్త్రిగారి కవిత్వము బహురసవంతమయినది. భాష బహుసులభము. ఎంత గొప్పభావము నయినను వారు బాలునికయిన నర్థమగునట్లు బహుసులభమయిన భాషలో బహురసవంతముగ చెప్పగలరు. వారినుండి ఈ గుణమును ఈ నాటి తెలుగుకవులు

---

* విరిసెజ్జలో కొంతభాగము 'భారతి' లో మొదట ప్రకటింపబడినది.

నేర్చికొనవలసి యున్నది. అట్లు నేర్చికొని తెలుగుకవిత్వములోని 'తెలుగు' అను మాటను నిలబెట్టవలసి యున్నది.

ఈ కాలపు కవిత్వములో సాధారణముగ తేటగీత లక్షణము ఉపయోగింపబడుచుండును. కాని పార్వతీశ్వరశాస్త్రిగారు తమరచనలలో మంజరీద్విపద లక్షణమును వాడియున్నారు. ఈ లక్షణము వీరికవిత్వమున కెంతయు సరిపోయినది. కవిగారి ప్రకృతివర్ణనలలో నొక ప్రత్యేకగుణమున్నది. వీరు ప్రకృతికి మనుష్యచైతన్య మారోపించి వర్ణింతురు. అద్వైతసిద్ధి పొందిన వీరికి జగత్తు అంతయు సచేతనముగ నుండుట సహజమే.

మండపాకకవిగారి కవిత్వములో ధ్వని విశేషముగ నుండును. కవిగారి జీవితచరిత్ర పూర్తిగ తెలిసినగాని వారి రచనలలో కొన్ని భాగములు మనకు సంపూర్ణముగ అర్థముకావు. శ్రీ శాస్త్రిగారు తమ జీవితచరిత్రను త్వరలో ప్రకటించెదరని తలచుచున్నాను.

ఈ కవిగారి గ్రంథములలో మనకొక చిన్న విచిత్రము కనబడుచుండును. ఈయన తాను వెనుక ప్రక

టించిన ఖండకావ్యములనే తిరిగి తన గ్రంథములలో ప్రకటించుచుండును. 'విరిసెజ్జ' లోని రెండవ ఖండ కావ్యము తేనెపట్టులో మొదట ప్రకటింపబడినది. 'అలసిపోయితిని' అనుపాట పాలవెల్లిలోను, తేనెపట్టు లోను ప్రకటింపబడినది. అయిదవ ఖండకావ్యములో తేనెపట్టులో ప్రకటింపబడిన 'చీకటి' అను ఖండ కావ్యము ఉపయోగింపబడినది. వీరి గ్రంథములలో ఇదొక విచిత్రము.

శ్రీ పార్వతీశ్వరశాస్త్రిగారి గ్రంథములను ఐహిక ములగు మరికొన్ని గ్రంథములతో సరిపోల్చకూడదు. ఒకవేళ సరదాకు ఏ గీతాంజలితోనో సరిపోల్చితిమో ఆ గ్రంథముకంటె వీరి గ్రంథములు ఎన్నివందల లేక ఎన్నివేల రెట్లు ఎక్కువో మనము నిర్ణయింపలేము. కనుక వీరిగ్రంథములను ఐహికములగు ఇతరగ్రంథము లతో సరిపోల్చకూడదు అన్నాను.

శ్రీ శాస్త్రిగారి ఆధ్యాత్మికభావములను గురించి మనము వేరుగ చెప్పలేము. వారి భావములు కేవ లము స్వకీయములు.

'పరమేశుప్రేమ స్వభావమెట్టిదియో
అనుభవించినవాడె సాక్షి దీనికిని'.

శ్రీ మండపాక పార్వతీశ్వరశాస్త్రిగారి కవిత్వము నానందించు భాగ్యము ఒక్క తెలుగువారికే గలదు. కాని వారి భావములను ఆనందించు భాగ్యము భారతీయుల కందరికిని కలదు. భారతీయులు వీరి గ్రంథములను చదివి అభివృద్ధి చెందెదరుగాక యని కోరుచున్నాను.

రాజమహేంద్రవరము,
30—1—1935

టేకుమళ్ల కామేశ్వరరావు



సత్యానందనాథస్వామి

*

Come, live with me and be my Love.
* * I will make thee bed of roses.

Marlowe.

శ్రీ సత్యానందనాథుల పాదపద్మముల
సన్నిధిని

To you! to you! all song of praise is due
Only in you my song begins and endeth.

Sidney.

*

*

Befriend me, Night, best Patroness of Grief!
Over the pole thy thickest mantle throw,
And work my flattered fancy to belief
That Heaven and Earth are coloured with my woe;
My sorrows are too dark for day to know:
The leaves should all be black whereon I write,
And letters, where my tears have washed.
a wannish white.

Milton.

*

*

చ. ఖలుఁ డీలఁదప్పులేవెదకుఁ గావ్యరసానుభవంబుఁ జేయలేఁ
డొలుకులుగోరుఁగాక, ముదమూనఁగగర్ధభ మొంద నేర్చునే
మలయమరుద్విధూతి మధుమాసవికస్వర కేసరావళీ
కలితపరాగయోగ పరికల్పితపేశల తల్పసౌఖ్యమున్ !

క. ఎల్లరుమెచ్చని మత్కృతి
నుల్లంబునమెచ్చుఁగాత యొకఁ డుష్ట్రికులం
బొల్లనిపల్లవితామ్రము
కొల్లలుగాఁబొగడ నొక్కకోయిలలేదే !

రసాయనము

*

విరిసెజ్జ

i

విరిసెజ్జఁ జూచి నివ్వెఱఁ బొందనేల ?

* * * * *

నా వలపుల పంట నా నోముఫలము
నా ముద్దులకొటారు, నా మోహనాంగి
నాదు ప్రేయసి వచ్చి, ననుఁగరంగించి,
మెల్ల మెల్లఁగఁ జెంత మెలఁగిన వేళ
విరిసెజ్జఁజేరి, యబ్బురపాటు తోడ,
ననునయాలాపంబు లన్యోన్య మొప్పు,
నాత్మేశ్వరియునేను నంతంబులేని
యానందవార్ధి మున్గాడుచుండెదము.

* * * * *

ఆనందమునఁ దేలియాడుచుండెదము.

* * * * *

ఏనెఱుంగుదును నా యింతిచిత్తంబు,
నాదుచిత్తంబును నాయింతియెఱుఁగు ;
ఇంతియు నేనును నేకచిత్తమున

విరిసెజ్జ

విరిసెజ్జపై నిల్చి వేడ్కలందెదము.

* * * * *

* * * * *

ననుఁజూచి లోక మేమనుకొన్న నేమి ?
నాకేల యాచింక ? నాపని నాది.
లోకంపు సేవయే నాకుఁ బ్రియంబు,
లోకంపు సేమంబె నాకు నిష్టంబు,
తలఁచెద లోకమంగళము యెల్లపుడు.
కాని, లోకపు మెప్పుఁ గాంక్షింపఁబోను.
నను మెచ్చి లోకంబు నను గౌరవించు
ననుచుఁ జిత్తమునందు నరయనే వేళ.
నాయింతితోఁ గూడి నాయిచ్చమీఱ
విరిసెజ్జపై నిల్చి ప్రేమతోలాడ
నేనుముచ్చటలాడి నెనరొందు వేళ,
నాయూసు తలఁపక, ననుఁజూచి నగక,
తన యుపేక్షయె నాకుఁ దగినకట్నముగఁ
దలఁచి యూరకయుండుతలఁపె చాల్నాకు.

* * * * *

విరిసెజ్జఁ జూచి నివ్వెఱఁబొందవద్దు.

పరిసైజ్జ

ii

Ask and it shall be given you ;
Seek and you shall find ;
Knock and it shall be opened unto you,
For, everyone that asketh receiveth,
And he that seeketh findeth ; and to
Him that knocketh it shall be opened.

The Holy Bible.

అమ్మ చెప్పినమాట యాలకించితిని.

*   *   *   *   *

మాయమ్మ నాకొక్క మాణిక్యమిచ్చె,
మాణిక్యమును జూచి మదిఁబొంగినాను.
దినమున కొక క్రొత్త తీరుగాఁదోఁచి,
మదికి నుత్సాహంబు మాణిక్యమొసఁగె.
ముద్దులుఁగుఱియుచు, మురిపెంబుఁగొనుచుఁ ;
జెలిమి మాణిక్యంబు సేయుచునుండె ;
తళుకుఁదళుక్కను తన కాంతితోడ

మురిసి మాణిక్యంబు మోదంబొసంగె.

*　　*　　*　　*　　*

*　　*　　*　　*　　*

నిలిచినఁ గూర్చున్న నిదురవోయినను,
చెలులతో ముచ్చటల్ పలుకుచుండినను,
ఏకాంతమున నుండి యీశ్వరింగొలిచి,
ధ్యానించుచున్నను, ప్రార్థించుచున్న,
నేమితలంచిన, నేమిచేసినను,
నాదు మాణిక్యంబు నా చెంతనుండె,
చెంతనుండి ముదంబుచిందించుచుండె.

*　　*　　*　　*　　*

చనుచుండె నీరీతి దినములు నెలలు,
నెలలును నేండ్లును నిలువక చనియె;
ఆనందమునఁ దన్మయంబయ్యెమనము,
ఎన్ని యేండ్లయ్యెనో యెఱుఁగను నేను,
అంతయు నొకదినమ్మైనట్లు తోఁచె.
తన్మయంబైనచిత్తముతోడ నెపుడు
నేను మాణిక్యంబు నెఱిఁగూడియుంటి
మితరచింతలుమాని యేకభావమున.
ఆటలఁ బాటల నానందమిచ్చి

నాకు మాణిక్యంబు ననుపులు గఱపె.
చెంత మాణిక్యంబు చేరియున్నపుడు
క్రొత్తభావంబులు గుఱియుచునుండి
నాకవిత్వంబు విజ్ఞానంబునొందె.
మాణిక్యమును నేను మలసియీరీతి
దినములు సాగించుకొనియుంటిమి—

* * * * * ఐన

అకట—ఏమందు—అన్యాయ మన్యాయము—
ఏవేళ కేమౌనొ యెవ్వఁడెఱుంగు?
కాలమెల్లపు డొక్కగతి నుండఁబోదు.

* * * * *

మాణిక్య మొకనాఁడు మఱిమఱి వెలిఁగి,
యెన్నశక్యముకాని హృత్ప్రీతినొసఁగె;
మఱచితి లోకంబు, మఱచితి వేళ,
నను నేనె మఱచి యానందమైయుంటి;
ఆడితి మాణిక్య మఱచేతఁ దాల్చి,
ఎగురవైచితి దాని నెగసిపట్టితిని;
ఎగురవైచుచు దాని నెగసిపట్టుచును,
నాటాడసాగితి నద్దానిఁగూడి;
ఎగయుచు, దిగుచును, నెగయుచు మరల,

నాడించిసట్టులే యూటలాడుచును,
మదికి మాణిక్యంబు ముదమిచ్చుచుండె,
ముదమునఁ బొదలుచు మదినిద్రవోయె,
మాణిక్యమేడనో మాయమైపోయె!

*　　*　　*　　*　　*

*　　*　　*　　*　　*

*　　*　　*　　*　　*

తెలివివచ్చెన——చుట్టుఁ దేరిచూచితిని——
లేదు మాణిక్యంబు లేదటచేత——
అటచేతి మాణిక్య మక్కటా, పోయె!
ఈవలఁగంటి, నే నావలఁగంటి,
నేవలఁగన్నను నేమిలాభంబు?
లేదుమాణిక్యంబు లేదేడఁగూడ,
మాణిక్యమేమయ్యె?——

*　　*　　*　　మఱికనంబడదు.

పోయెమాణిక్యంబు, పోయెనయ్యయ్యొ,
అయ్యయో మాణిక్య మదిపోయెనెటకో!
కలయమ్యొ మాణిక్య మలయికకలిగె,
నలయిక తోడ నేనటవసాగితిని,
అఱచితి——వెఱచితి——పఱచితి——మఱల

పఱచితి—వెఱచితి—పఱచితి—కాని,
మాణిక్య మొకసారి మఱి కంటఁబడదు.

*　　*　　*　　*　　*

*　　*　　*　　*　　*

అమ్మరో మాణిక్య మదపోయెనమ్మ
ఎయ్యెడఁబోయెనో యెఱుఁగనోయమ్మ
ఏమి చేసెదనమ్మ యేమినాకర్మ
మేగతిగలదమ్మ, ఏమిచెప్పెదవు?
నాకర్మ మేమమ్మ నాగతియేమి?
అనుచు నేడ్చుచుఁబోయి, యమ్మపాదముల
నశ్రులఁదడుపుచు, నఱచుచునుండ,
నఱచేత మాయమ్మ యంటె నాశిరము;
అఱచేత శిరమంటె, యాశీర్వదించి,
యమ్మ యిమ్మెయిఁ బల్కె ననునయించుచును;
పోయెఁ బోయె నటంచుఁ బొక్కుచు నిట్టు
లఱచిన మాణిక్యమబ్బునే మఱల?
వెదకుము, మఱిమఱి వెదకుము తండ్రి,
వేఱొక్కపనిమాని వెదకుముదానిఁ,
బౌరుషంబునఁ గాని పనులునుగలవె?
వెదకి కన్గొనుటే వివేకంపుఁ దెఱవు;

వెదకుము—చూడుము—వెదకికన్గొనుము,
నాముద్దుఁగుఱ్ఱ, మనశ్శాంతి నీకుఁ
గలుగును, వెదకుము -తలఁకొనవద్దు—

* * * * *

అమ్మ యిమ్మాట్కి నాకాజ్ఞయొసంగ,
నమ్రయాజ్ఞను శిరంబందుఁదాల్చితిని,
వేఱొక్కపనిమాని వెదకసాగితిని.

* * * * *

* * * * *

వెదకితి, వెదకితి, విసిగిపోయితిని,
కాని మాణిక్యంబు కానరాకుంటె,
పిచ్చి యెత్తినయట్లు వెదకసాగితిని,
పిచ్చి పట్టినరీతిఁ బిలువసాగితిని ;
పలుకరింపఁగ లేదు, పలుకాడ లేదు,
మాణిక్య మొకసారిమాటాడలేదు ;
పలుకాడలేదు, చూపట్టఁగాలేదు ;
ఇంక నా మాణిక్యమేడఁ గన్పట్టు !
పిచ్చియెత్తినరీతిఁ బిలువసాగితిని ;
ఇలువీడి దవ్వుగా నేఁగసాగితిని ;
ఎటుపోవుచుంటినో యెఱుఁగను నేను,

పోవుచునుంటిని బోవుచునుంటి.

*　　　*　　　*　　　*　　　*

*　　　*　　　*　　　*　　　*

*　　　*　　　*　　　*　　　*

చీఁకటి యంతటఁ జిక్కనై యుండెఁ,
దోవ కన్పడకుండెఁ ద్రోవఁ బాటయ్యె ;
ఆకసంబునఁ జేరి యరయసాగితిని,
కోటిమాణిక్యాలు కూడికన్పడియె ;
కోటిమాణిక్యాలు కూడినన్నైన
నాదు మాణిక్యంపు మోడివీఁగలవె !
లేదు మనశ్శాంతి, లేదు సంతృప్తి,
నాదు మాణిక్యంబు నాకుఁగన్పడదు !

*　　　*　　　*　　　*　　　*

*　　　*　　　*　　　*　　　*

కుంచాలతో మంచు కుఱియుచునుండె,
వలిగాలి వడవడ వడకించుచుండె,
చలియును మంచును దెలియరావయ్యె ;
మాణిక్యమును జూడ మదికోరుచుండె ;

*　　　*　　　*　　　*　　　*

పోయితి—పోయితి—పోయితినెటకో,

పోవుచునుంటిని—త్రోవ తప్పితిని—
దవ్వయ్యె మాయిల్లు—దవ్వుదవ్వయ్యె—
చలిబాధ మెండయ్యె, నిలువెల్లఁ దడిసెఁ,
గాని, మాణిక్యంబు కనఁబడకుండె,
దాఁటితిఁ దోఁటలు, దాఁటితి నిళ్లు
దాఁటితిఁ బుట్టలు, దాఁటితి గట్లు,
దాఁటితి నేళ్లును, దాఁటితి నూళ్లు ;
ఇళ్లును తోఁటలు, నేళ్లును నూళ్లు
నెన్నో దాఁటితిఁగాని, యేమి లాభంబు ?

* * * * *

తెల్లవారఁగఁ జొచ్చెఁ దిమిరంబు వోయె,
వెచ్చని వెలుఁగుతో వెలిఁగె సూర్యుండు ;
చలికి మంచుకు నాకుఁ గలిగిన బాధ
వెచ్చని యెండచే విరిసిపోనాగె ;
లేయెండ నాకింత సాయంబొనర్చె,
నాదు మాణిక్యంబు నాకిచ్చునంచుఁ
బుట్టి డాసనబొంది పోవుచునుంటి ;
చెట్లుచేమలుపోయె, మట్టినేలలును,
బసిమిచాయలుపోయె, నిసుక యెడారి
కనుపట్టె—దానిలోఁ జనుచు నే నుంటి ;

గట్టినేలలుపోయె — పట్టియెడారి
నిసుకలోఁ గాలూని యేఁగుచునుంటి ;
ఎలయెండవెచ్చనై యింపయ్యెనిసుక
దారకు మాణిక్యమం చరయుచునుంటి.
ఆకసంబున మీఁది కెక్కె సూర్యుండు,
ముదిరి వేఁడెక్కుఁ ద్రై, కదిరె నెండయును ;
ముదిరినయెండతో ముదిరెను వేఁడి,
వేఁడియు నిసుకయుఁ గూడె నెయ్యమున ;
వేఁడియు గాలియుఁ, గూడెఁ బ్రేమమునఁ
గాలిన యిసుకలోఁ గాలెఁ బాదములు,
కాలిన యెండలోఁ గాలెను దలయుఁ
గాలిన గాలిలోఁ గాలె దేహంబు ;
తలయు, దేహమును బాదంబులుమాడి
దాహంబుతోఁ గూడ దహియింపసాగె—

*   *   *   *   *

*   *   *   *   *

*   *   *   *   *

లేదు చల్లనినీడ, లేదు జలంబు,
మలమల నిసుకలో మాడుచునుంటి,
ముందుకుఁబోలేక మూల్గుచునుంటి,

విరిసెజ్జ

వెనుకకుం బోలేక విసుగుచునుంటి,
వెనుఁజూచి, మునుఁజూచి, వెఱచుచు నుంటి,
లేదు మాణిక్యంబు, లేదు మోదంబు,
ప్రాణమే లేకున్న పగిదిఁ గన్పట్టె.
మట్టమధ్యాహ్నన, వట్టియెడారి
బట్టబైటనునిల్చి, పడరాని పాట్లు
పడుచున్న నాపైని విడవేమికినుక ?
కొనవేమిజాలి, చేకొనవేమినన్ను,
నాయమ్మ, నాతల్లి, ననుఁగన్నతల్లి,
నాయమ్మ నీకిది, ననుఁజూడవేమి ?
తలఁదాల్చి నీయాజ్ఞ, యిలువీడినాను,
వెదకి మాణిక్యంబువీక్షింప నెంచి,
గండ్లను ముండ్లను గడచనినాను.
త్రోవతప్పించి యీత్రోవఁ బెట్టితివి.
ఈత్రోవఁబెట్టితి వేటికోయమ్మ,
మలమల నిసుకలో మాడ్చుచున్నావు—
అగ్నిపరీక్షఁ చేయఁగనేలతల్లి,
కలదో నీపైభక్తి కలదోకో లేదో,
కలదో మాణిక్యంబు గనువాంఛలేదో,
తెలియఁగానెంచి, యీతీరుననన్ను

నగ్నిలోఁ బడఁద్రోసి, యలయింతు వమ్మ !
నీపరీక్షకు నేను నిలువఁగాఁగలనె,
భరియింపజాలని బాధ నాతల్లి !
మాణిక్యమునుజూడ మదిఁగోర్కె విడదు,
భక్తి నీపైని నాకుఁ బలుచఁబాఱదును——*
వలదింక నను బరీక్ష——నిలువఁగాఁజాల——
జాలిజూపించి సన్నేలుమోతల్లి ;
యనుచు నీరీతిగా నమ్మను వేడి,
యమ్మనుగొలుచుచు నడుగుముందిడఁగ ;
జల్లఁగా జిలుగాలి చనుదెంచెనపుడు.

* * * * *

* * * * *

* * * * *

హాయిగొల్పును జల్లనైన యాగాలి
యాగాలివచ్చి నా యసువులు నిలిపె,
లేనిసత్తువవచ్చి పూనె నాయెదను,
గాలివచ్చినదెసఁ గాల్ద్రిప్పినాను ;
చయ్యన గమనంబు సాగించినాను ;
ఇంచుకదవ్వు నే నేఁగకమున్న
ఖర్జూరవృక్షంబు గన్పట్టెనవుల ;

రమ్మురమ్మనిపిల్చెఁ గొమ్మచేతులను ;
వడివడి నాదెస నడచిపోయితిని,
ఖర్జూరవృక్షంబుకడ నిలుచుంటి ;
అచటఁగన్పడె నొక్క యమృతంపుబావి ;
హాయిగాఁ జిఱుగాలి యటవీఁచుచుండె ;
చల్లగాలికిఁ దెప్పిరిల్లెఁజిత్తంబు.

*　　*　　*　　*　　*

ఖర్జూరవృక్షంబుకడఁ గొంతసేపు
చెమ్మటలారంగఁ జేసి నిల్చుంటి;
కొందుటఁబ్రాణంబులు కూడె నొక్కింత;
అమృతంపుబావి మున్గాడసాగితిని;
అమృతంపుబావిలో నానంద మొప్ప
మునుఁగుచుఁ దేలుచు మునుఁగుచు నుంటి
మాణిక్యమనుమాట మఱచితినచట.
అంతలో మాణిక్యమనుమాటతోఁచె;
బావిలోపలనుండి పైకివచ్చితిని,
మాణిక్యమునుజూడ మరులుఁజెందితిని.
ఖర్జూరవృక్షంబుకడకు వచ్చితిని.
అమృతంపుబావిలో నటజన్మమంది
యల్లిబిల్లిగనల్లి, కొల్లఁగాఁ బూచి,

యడవిమల్లియతీఁగె యలరారుచుండె;
కొమ్మచేతులతోడఁ గోరి వృక్షంబు
దయఁజూపె నడవిమల్లియ తీఁగె నాకు,
అడవిమల్లియతీఁగె నరసికన్గొంటి,
నానంద మొకసారి యావిర్భవిల్లె;
మాణిక్యమనుమాట మఱచిపోయితిని.
అడవిమల్లియపైని స్వాంతంబునిలిచె;
ఎన్ని జన్మములందొ యేనును సదియుఁ
గలసి యానందంబుగని యున్నయట్లు,
చప్పునఁ దోఁచె నాస్వాంతంబునందు.
అడవిమల్లియతీఁగె నప్పుడు కౌఁగింటఁ
జేర్చి, యానందంపుసీమ దాఁటితిని.
పక్వఫలంబు లుపాయనమిచ్చి,
ఖర్జూరవృక్షంబు గౌరవంబిచ్చె;
అమృతంపుబావిలో నమృతంబుఁగ్రోలి,
ఖర్జూరఫలము లుత్కలికభుజించి,
అడవిమల్లియతోడ నాడసాగితిని,
మాణిక్యమనుమాట మఱచిపోయితిని,
మఱచితి లోకంబు మఱచితి నిల్లు,
అడవిమల్లియఁగూడి యాడుకొంచుంటి.

కలిగె మనశ్శాంతి, కలిగె సంతృప్తి—
కలిగె నానందంబు, కలిగెనన్నియును.
అమ్మచెప్పినమాట యూఁకొంటినప్పుడు,
వెదకికన్గొనుటె వివేకంబటంచు
నమ్మచెప్పినది సత్యంబుగాఁ దోఁచె.
వెదకితి—కనుఁగొంటి—ముదమునుఁ జెందితిని.
పూర్వజన్మములం దపూర్వమౌ ప్రేమ
ననుఁగూడియుండిన నామల్లితీఁగె
నన్నుఁ జేరి యానందమును గల్గఁజేసె.

*　　*　　*　　*　　*

అమ్మ చెప్పినమాట యాలకించితిని,
అమ్మకారుణ్యంబు నందఁజాలితిని;
నామల్లితీఁగెయే నాకుఁగన్పడియె;
అమృతంపుబావితీరమున నిచ్చోట
నీకల్పవృక్షంపుటింపుఁగ్రీనీడ
నడవిమల్లియతోడ నాడుకొంచుందు;
ఆటాడి యానందమందుచునుందు;
అడవిమల్లియయు నే నాటాడియాడి,
అమృతంపుబావి మున్గాడి తేలెదము;
అందులో మాయమ్మ నరసిచూచెదము,

అమ్మలోఁగరఁగి మేమంతరించెదము,
అడవిమల్లియతోడ నంతరించెదను.

*   *   *   *   *

*   *   *   *   *

*   *   *   *   *

అమ్మచెప్పినపల్కు లాలకించితిని.

*   *   *   *   *

విరిసెజ్జ

iii

God is Love: and he that dwelleth in
Love dwelleth in God and God in him.

— *The Holy Bible*

చిత్కలానందకలికా ప్రేమరూపా ప్రియంకరీ
ప్రాణేశ్వరీ..................

లలితా సహస్రనామ స్తోత్రము

*　　*　　*　　*　　*

అమ్మకారుణ్యాని కంతంబు లేదు.

*　　*　　*　　*　　*

*　　*　　*　　*　　*

మాతోటలో నొక్క మందారచెట్టు—
ఆచెట్టుచెంతనే యమృతంపుబావి,
అడవిమల్లియతీవ యాబావిక్రేవ,
ఆమల్లెతీవతో నాడుకొంచుంటి.

*　　*　　*　　*　　*

విరిసెజ్జ

జిలుఁగుఁబూవులబుటాల్ సెలువారుచున్న
యాకుఁబచ్చనిచీర హాసుమైఁదాల్చి,
నెమ్మనివాసనల్ నిండఁజేయుచును
జిగురుఁజేతులతోడఁ జేరఁగాఁబిల్చి,
తీఁగబుజాలతోఁ గౌఁగిటంజేర్చి,
తేఁటిపాటలఁబాడి, తీపులంగొల్పి,
దినమున కొక క్రొత్తతీరుగాఁ దోఁచి,
యడవిమల్లియతీఁగ యానందమిచ్చె.

*   *   *   *   *

మందారవృక్షంబుక్రిందఁగూర్చుండి,
యడవిమల్లియుఁగూడి యాటాడుకొంచు,
ననునేనె మఱచి యానందంపుఁగడలి
మునుఁగుచుఁ దేలుచు మునుఁగుచు నుంటి.
ఇనుఁడస్తమించుట మెఱుఁగనియట్లు
దినములు రేలును జనియె నెన్నెన్నొ.

*   *   *   *   *

*   *   *   *   *

ఒకనాఁటి తొలుసంజ నుత్సాహమొప్ప
నడవిమల్లియుఁగూడి యాడుకొంచుండ
వింతవింతలపాట వినవచ్చెనొకటి.

వి శ సె జ్ఞ

పాట వినఁబడుప్రక్కకుఁదిరిగి
మనసారఁగా దాని వినుచు నేనుండ
క్రొంగ్రొత్తవింతరంగులు కనంబడియె,
ఆపాట లారంగు లటు లాగెమనసు,
మనసు మెల్లఁగ లాగికొనిపోయెనన్ను ;
అడవిమల్లియవీడి యటుపోవుచుంటి.
మందారవృక్షంబు మఱచిపోయితిని.
అమృతంపుబావి దవ్వయ్యెను నాకు.
తోఁటను దాఁటితిఁ బాటలేదయ్యె ;
పాటలు రంగులు ప్రక్కనే చెలఁగె ;
దరిఁ జేరఁగాఁబోవ, దవ్వయ్యెఁ బాట
దరిఁ జేరఁగాఁబోవ, దవ్వయ్యెరంగు ;
దరిదరిగాఁబోవ, దవ్వుదవ్వగుచుఁ
బాటలు రంగులు పాఱిపోసాగె ;
పాటలు రంగులు పాఱుచునుండ,
వెంబడించుచు నేను వెడలసాగితిని.
వీనులకింపుగా వినుచుంటిఁ బాట
కన్నులకింపుగాఁ గనుచుంటిరంగు,
పాటలు రంగులు పట్టెను మనసు,
మనసు లాగుచునన్ను మఱిమఱియీడ్చె ;

మాతోఁట విడనాడి మఱిమఱిపోయి,
మఱిపోయి, మఱిపోయి, మఱిమఱిపోయి,
వెఱ్ఱిమొత్తినరీతి వెడలసాగితిని,
తోఁట కన్పడలేదు, దూరమైపోయె ;
పాట విన్పడలేదు, పాటె నెయ్యేడకో,—
తోఁటలత నీరంగులు తెలియరావయ్యె ;
లేవయ్యె రంగులు, లేదయ్యెఁ బాట,
బాట లేదయ్యె, మా తోఁటలేదయ్యె.
ఎందు నేనుంటినో యెఱుఁగలేనైతి,
ఏమి చేయఁగనౌనో యెఱుకలేదయ్యె.
వెనుకకుఁబోలేను, కనరాదు బాట,
ముందుకుఁ బోలేను మునుము కన్పడదు.
మనసు నిల్వఁగలేక, మఱినిల్వలేక,
పోవుచునుంటిని, —పోవుచునుంటి
ఎటుపోవుచుంటినో యెఱుఁగను నేను,
వెనుకకో ముందుకో వివరింపలేను,
పోవుచునుంటిని—పోవుచునుంటి.

* * * * *

* * * * *

మలుసంజవచ్చెఁ గ్రమ్మఁగఁజొచ్చె నిరులు,

కాలుచీఁకట్లు నల్గడఁ జిందుచుండె,
గండ్లలో ముండ్లలోఁ గదలలేకుంటి,
నడవిలోపల నొంటి నడలుచు నుంటి,
కీల్గలమెకములు గీపెట్టినట్టు
లుఱుముచునుండె నబ్బురపుమొయిళ్లు ;
వానతొండాలతోఁ బైఁబడుచుండె,
గడగడలాడించి గాలులువీఁచె,
అడవిచెట్టులు మీఁదఁబడునట్టులుండె;
దయ్యఁపుటత్తితో ల్దాఁకెనుదుదిని;
తుదిఁదాఁకెధైర్యంపుఁదునుకవెలుంగు,
సడలుధైర్యంబుతో సడలునఁగుంది,
యలసిపోయితి ముందుకడుగిడలేక.
—అలసిపోయితిని—
ఏమేమొయనుకొంటి; ఏడ్వసాగితిని,
అలసిపోయితి నయ్యొ, అలసిపోయితిని.
అలసిపోయితిని—
అలసిపోయితి నయ్యొ, అలసిపోయితిని,
కటకటా నీకింత కాఠిన్యమేల?
* * అలసిపోయితిని.

* * * * *

తిరిగితిఁదిరిగితిఁ దెరువులన్నియును, *
వెదకితివెదకితి వేసారిపోతి,
ఏమూలనుంటివో యీచలంబేల,
యెందు దాఁగుంటివో యేలకన్పడవు!
అలసిపోయితి సయ్యో, అలసిపోయితిని,
కటకటా, నీకింత కాఠిన్యమేల ?

*　　*　　*　　*　　*

గట్టుపైఁ బుట్టపై గల్లారిజారి,
పడుచు, లేచుచు, ముండ్లబాటలన్నియును,
వెదకితి, వెదకితి, విసివిపోయితిని;
తిరిగితిఁదిరిగితిఁ దెరువులన్నియును,
అలసిపోయితి సయ్యో, అలసిపోయితిని,
కటకటా నీకింత కాఠిన్య మేల ?

*　　*　　*　　*　　*

ఆకసంబున మబ్బులలముకొన్నపుడు,
చీఁకటి యంతటం జెదరి యున్నపుడు,
వర్షంబు బోరనఁ బడుచున్నయపుడు,
తిరిగితిఁ దిరిగితిఁ దెరువుదప్పితిని,
అలసిపోయితి సయ్యో, అలసిపోయితిని,

కటకటా, నీకింత కాఠిన్యమేల ?

* * * * *

ఏమనుకొంటినో యెఱుఁగను నేను,
ఏమి కావలయునో యెఱుఁగలేనైతి,
అలసిపోయితినంచు నఱచుచునుంటి ;
మింటఁ దళుక్కున మెఱపొండు మెఱసె,
మెఱపువెల్గునఁ గనుల్ మిఱుమిట్లు గొల్పి,
యెదుటఁగన్పడెఁ బదియేండ్ల బాల—
పదియేండ్ల బాల నాయెదుటఁ గన్పడియె,—
ముసిముసినగవుల ముదమిచ్చెఁ బాల,
లోలోనఁ దనిసితి బాలవైఖరికి,
చేసాపి, కౌఁగింటఁ జేర్చెనన్ బాల,
కరఁగి నాలోపలఁ గలసెను బాల,
కరఁగించి, లోనన్నుఁ గలపెను బాల ;
నాలోన బాలయు, బాలలో నేను,
గరఁగి, యొండొరులలోఁ గలసిపోయితిమి.
ఏమయియుంటినో యెఱుఁగను నేను,
నేననుమాటయే పూనకయుంటి,
ఎంతసేపుంటినో యెఱుఁగనిమ్మాళ్కి.

* * * * *

*　　*　　*　　*　　*

*　　*　　*　　*　　*

తెలివివచ్చెను ; చుట్టుఁ దేరిచూచితిని,
ఒక్క యుద్యానమం దుంటిని నేను,
వింతవింతలచెట్లు, విలసిల్లుచెట్లు,
రంగురంగులపూలు, రాణించుపూలు,
వింతలపండ్లును, వింతలంగొల్పె.
వింతలఁజూచుచు, వింతలఁగొనుచు,
వింతముదంబున వెడలుచునుంటి.
పూవుటోరంబునఁ బూలు కోయుచును,
బాలకన్పడె, నాదు ప్రేమఁ నొక్కడను.
బాలగాదిప్పుడు, ప్రౌఢయుఁ గాదు ;
లసిత నిర్మల మంజుల మనోజ్ఞమైన,
లలితరూపముఁదాల్చి యలరారుచుండె.
ఆలలితాకార మరయుచునుంటి,
నానందమునఁ దేలియాడుచునుంటి,
ననుఁజూచి, తరుణి యానందంబునొందె,
ఆనందమునఁ జెంతకరుదెంచెఁ దరుణి ;
ప్రేమ చూపులలోన వెలయుచు నుండఁ
జల్లనిచేతులుసాపి, కౌఁగిట

ననుఁజేర్చి, తనివార నను ముద్దులాడె;
ముద్దాడుతరుణిని ముద్దాడుచుంటి,
ముద్దాడుచుంటిని, ముద్దిడుచుంటి,

*   *   *   *   *

*   *   *   *   *

తరుణుండనై నేను తరుణియై తరుణి,
ప్రేమస్వరూపాల వేఱెఱుంగకయ
సారూప్యమునఁబొంది సంతసించితిమి.
సారూప్యమునఁబొంది సంతసంబొప్ప
సతితోడ నేనును, సతియు నాతోడ,
నాటపాటలమున్గి యులరసాగితిమి.

*   *   *   *   *

*   *   *   *   *

*   *   *   *   *

*   *   *   *   *

సీ. అభిరామ నవపల్లవారామకుంజవా
టికలఁగీరముల నాడించు కొనుచుఁ,
బద్మాలయోదర ప్రౌఢసారసవీథి
నంచలవేడబం బరసికొనుచు,

విరిసెజ్జ

గాంగేయధామశృంగవిటంకముల నీల
కంధరోజ్జ్వలగతుల్ గాంచికొనుచు,
విమలసింధుద్వీపవేదిక నరుణాప్త
ఖగవిహారప్రౌఢిఁ బొగడికొనుచు,
రతియుఁ జేతోభవుండును, భారతియు నజుఁడు,
శచియు నమరాధినాథుండు, జలధిసుతయు,
నజ్జనాభుండు (నయి) మించి, యఖిలసమయ
సముచితక్రీడనలిపితి సతినిగూడి.

(వసుచరిత్రము—ఇంచుక మార్పుతో)

*   *   *   *   *

*   *   *   *   *

ఆటపాటలలోన నడఁగి పెనంగి,
యేనును దరుణియు నింపొందుచుండ,
దినము లొక్కొక్కటి చనుచునేయుండె,
క్రొత్తక్రొత్త ముదంబు గూర్చుచునుండి,
దినదినంబును మార్పుఁ గనుచుండెఁ దరుణి.
తరుణరూపంబునఁ దరుణితోఁదొల్త
సారూప్యభావ మొప్పారంగనుంటి.
సారూప్యభావంబు సడలగాసాగె.
ప్రేమ గౌరవమూచుఁ బెంపొందసాగె.

విరిసెజ్జ

ప్రేమతో గౌరవప్రీతి కన్నట్టి
గౌరవంబున నేను గనుచుంటిఁ గాంతఁ
బ్రేమతో నను గాంత వీక్షించుచుండె.
విరిసెజ్జపైఁ గాంత వరసిన వేళ,
సింహాసనేశ్వరి చెలువున నుండె.
మోహగౌరవములు మొనయుచునుండ,
శ్రీమహారాజ్ఞిఁ గాంచినరీతిగాఁగ
సంతసించుచునుంటిఁ గాంతఁ గన్గొనుచు.
కనుట కింపగుపూవుఁ గొని తెచ్చియిచ్చి,
తినుట కింపగుపండు గొని తెచ్చియిచ్చి,
కాంతకుఁ బరిచర్య గావించుచుంటి.
నాపరిచర్య సంతసమిచ్చె సతికి,
సతిని సేవించి నే సంతసించితిని.
ఆసేవతోఁ జె బ్రహ్మానందమున్గు.
మఱచితినామాట, మఱచితినన్ను,
కాంతనుగొల్చుటే కార్యమైయుంటి.
ఏకచిత్తంబున నీరీతిఁ గాంతఁ
గొలుచుచుంటిని, దినమ్ములు సాగుచుండె.
పరిపూర్ణమౌప్రేమ పరగించి, కాంత
నన్నుమాత్రమె చూచుచున్న దటంచు

ననుఁ గొలంచు, సేవించుకొనుచుంటిఁగాని,
ప్రేమలో వేఱొక్కవిధము కన్పట్టె.
పూవులాకులు వైచి పూజించుచెట్లఁ
బ్రేమతో నాయింతి వీక్షించుచుండె ;
ముద్దుగాఁ బల్కెడు ముద్దుఁ జిల్కలను
బ్రేమతో నాయింతి వీక్షించుచుండె.
పాటపాడెడు తేఁటి నాటాడు నెమలిఁ
బ్రేమతో నాయింతి వీక్షించుచుండె.
ఇంతిప్రేమయె నాకు నెందుఁగన్పట్టె.
ననుఁబోలె లోకమంతయు నింతిప్రేమఁ
గనుచుండె నన్నట్లు కన్పట్టెనపుడు.
మూఁడులోకంబుల మోహింపఁజేసి,
మోహినీరూపంబుఁ బూని యాయింతి,
ననుఁజూచి, ముసిముసినగవున నొప్పె.
ముసిముసినగవులో మునిఁగిపోయితిని,
మఱచితి లోకంబు, మఱచితి నన్ను,
ముసిముసినగవులో మునిఁగిపోయితిని.
తెలివివచ్చెను ; చుట్టుఁ దేరిచూచితిని,
అడవిమల్లియతోఁట నాడుచునుంటి ;
విరిరాలె మందారవృక్షంబునుండి,

విరిసెజ్జ

పిల్లతెమ్మెర మెల్లమెల్లఁగా వీఁచె,
అడవిమల్లియ వింతయగుచుఁ గన్పట్టె,
బాలరూపమునఁ గన్పడినట్టి కాంత,
లలితరూపమునఁ జెలంగిన కాంత,
శ్రీమహారాజ్ఞియై చెలఁగినకాంత,
యడవిమల్లియలోన నలరారుచుండె.
మూఁడురూపంబుల మొనసి కన్పట్టి,
మూఁడులోకంబుల మోహింపఁజేసి,
ప్రేమస్వరూపమై, ప్రీతినింపుచును,
మూఁడుమూర్తులకును మూలమైనట్టి
యాయమ్మయొకతెయే యడవిమల్లియును
నాకుఁగన్పడుచుండి, ననుజూచుచుండ,
నబ్బురపాటుతో ననుఁగొంటినిట్లు:
"అమ్మ, నీప్రేమకు నంతంబుకలదె?
నాతప్పులనుఁబాపి ననుఁ బ్రోచినావు;
తప్పుత్రోవనునిల్చి తలఁకొందనేల;
అమ్మనునమ్మిన నగవడుఁద్రోవ;
అమ్మకారుణ్యాని కంతంబు లేదు."
అనుచునీరీతిగా ననుఁగొనుచుండి,
అమ్మరూపంబున నలరారుచున్న

యడవిమల్లియఁగూడి యాడుకొంచుంటి. *
అమృతంపుబావిలో నమృతంబుఁగ్రోలి,
మందారవృక్షంబుక్రిందఁ గూర్చుండి,
అడవిమల్లియతోడ నాటాడుకొందు ;
అడవిమల్లియతోడ నమ్మలోఁగరఁగి,
యమృతంపుబావిలో నణఁగిపోయెదను,

* * * * *

అమ్మకారుణ్యాని కంతంబుగలదె ?

* * * * *

* * * * *

* * * * *

* * * * *

వి రి సె జ్జ

iv

ఓం—జాగ్రత్సుషుప్తికృత దక్షిణవామ భాగాం
స్వప్నస్వభావ పరికల్పిత జఘనస్య భాగాం,
తుర్యాతితుర్యఘటితానన హృత్ప్రదేశాం,
ప్రాణేశ్వరీం పరశివ స్వపరామృశామః॥

శ్రీమాతృకాచక్రవివేకః—

Watch—for ye know neither the day nor the hour, wherein the son of man cometh.

.—*The Holy Bible*

నిదురవలె, నిదురలోనొదవు స్వప్నమ్మువలె,
యుడుగఁనడిలేక, నన్నావరించెదవు;
గాలివలె, గాలిలోఁదూలు సౌరభమువలె,
చూచాయఁ గొలుపకే, సురిగిపోయెదవు;
ఎపుడో నీ యాగమన, ఎపుడో నీ నిష్క్రమణ?

శ్రీ. శ్రీ.

*   *   *   *   *

*   *   *   *   *

కనిపెట్టుకొనియుంటిఁ గాంతనుఁజూడఁ
గాంతఁ గౌఁగిటఁ జేర్పఁ గనిపెట్టుకొంటి.

*   *   *   *   *

*   *   *   *   *

జాజులు, మల్లెలు, సంపెంగపూలు,
పారిజాతములు, గన్నేరుపూవులును,
చెంబేలి, దిరిసెన, చేమంతివిరులు,
బంతిబంతులుగాఁగ, వింతలంతలుగ,
వింతల వింతల బంతులఁ దార్చి,
సెజ్జఁగాఁగూర్చి, పేర్చి, వెలార్చి, యోర్చి,
కనిపెట్టుకొనియుంటిఁ గాంతనుజూడ.

*   *   *   *   *

ఆకులతోడ వియ్యంబు లందుచును,
గారుచీకట్లు నల్లడఁ గ్రమ్మి యొప్ప.
అలరుగుత్తులతోడ నాటలాడుచును,
నలరుచుక్కలు తళ త్తళ లీనుచుండ.
ఆటలఁ బాటల మేటితనమ్ము
కొమ్మలకును నేర్పి, కూడిపాడుచును,

నాడుచుఁ జిఱుగాలి యందముల్ గొల్పె.

* * * * *

దూరాన నొకవెల్గు తోఁచుచునుండె.
వెలుఁగులో నొకమేడ వెలుఁగుచునుండె.
అచట మూఁడఁతస్తు లావలిక్రేవ
నాల్గవ యంతస్తునం గనంబడియె,
మెఱపట్లు మెఱయు నెమ్మోని కాంతులను
గ్రొందళ్కు లీనుచు సుందరియొకతె.
అందు మూఁడంతస్తు లందునుగూడఁ
గలరెందఱెందఱో తలిరుఁబోండ్లైన
నాల్గవ యంతస్తునం గనంబడ్డ
సుందరియే మది చూఱలు గొనియె.
లోకంబు మఱపించి లోనన్నుఁగూడె,
కాని, యామెంటనే కానరాకుండె ;
మేడతో నింతులు నేడకోచనిరి.

* * * * *

అరయుచు నొక్కండ నటుఁగూరుచుంటి,
నామది చూఱగొన్న మనోహరాంగి
నాదు చెంతకువచ్చి ననుఁబ్రోచునంచు,
విరిసెజ్జ సరిచేసి వేఁచియుండితిని.

కాంతను జూడంగఁ గనిపెట్టుకొంటి.

*　　*　　*　　*　　*

విరులతోఁ జుక్కలు వియ్యంబు వేఁడె
గాలి కొమ్మలఁగూడి మేలంబులాడె,
చీకటి యాకులు చలిమిని గూడె.

*　　*　　*　　*　　*

*　　*　　*　　*　　*

తారుచుఁ దక్కుచు దరిదరిగాఁగ
దవ్వుదవ్వులనుండి తరుణియొక్కర్తు
నాదు చెంతకువచ్చి నామ్రోల నిలిచె.
క్రొత్తరంగులతోడఁ గ్రొత్తదనంబు
క్రొత్తక్రొత్తగఁ జూపి, కోర్కిదీరంగ,
నెదుటనిల్చిన కాంత నీక్షించుచుంటిఁ
గాని, చిత్తంబు లగ్నంబుకాదయ్యె.
పలుకరించితిఁ గాంత పలుకాడదపింటెఁ
జిత్తమాకర్షించు చెయ్యి లేకుండె.
సహజంపుఁబలుకాడు శక్తి లేకుండె.
నిలువదు చిత్తంబు నీపైసినాకు,
లేదు రంగులపైని లేదు నాకాశ,
మేడలోఁ జూచిన మెలఁతవుకావు ;

విరిసెజ్జ

కాదు నావిరిసెజ్జ కాదు నీకింక
వెడలిపొమ్మటనుండి వెడలిపొమ్మనుచు,
నాయింతి నటనుండి యంపివైచితిని.
కనిపెట్టియుంటి నింకను గొంతసేపు.

* * * * *

నాప్రోల కేతెంచె నాతి యొక్కర్తు.
ముస్తీబులోఁ గ్రొత్తమురిపెంబు లేదు,
కాని, మాటలు మేటిగా నడుచుండె.
చకచక పలుకులు సాగించుచుండె;
విరసాలు, సరసాలు వెడలుచునుండె.
మాటల తేటకు మనసొప్ప లేదు,
చిత్త మానాతిపైఁ జేరఁగా లేదు.
కాదు నావిరిసెజ్జ కాదు నీకింక
వెడలిపొమ్మని చెప్పి వెనుకమోమైతి.
ఆనాతి యటనుండి యరిగె నెయ్యెడకో. *

* * * * *

ఇంతలో నొకయింతి యేతెంచెనటకు.
ముస్తీబులోఁ గొంత ముచ్చటకలదు;
కాదంతప్రాఁతది, కాదంత క్రొత్త
గాని, మాటలలోనఁ గనవచ్చెలోఁతు.

లోఁతైనమాటలు, లోలోనరసము,
కొంతకొంతమునకంబు గూర్చె నామదికి.
క్షణకాల మాయింతిఁ గనఁగొనుచుంటిఁ
గాని, చిత్తంబు లగ్నంబు కాదయ్యె.
చేసినమా సీబు చెయ్యాల్లెలం జూచి,
తెచ్చిన యందంబు తెన్నులు చూచి,
కొని తెచ్చు మాటలకొలఁకులు చూచి,
చిత్త మానందంబు జెందకయుండె;
కాదు నా విరిసెజ్జ కాదు నీకనుచు,
నాయింతి నటనుండి యంపివైచితిని.
మనసున కానందమును గూర్పఁగల్గి
విరిసెజ్జపై నిల్చి, కరమునురక్తి
ననుఁగూడఁగలకాంత కనఁబడదొక్క
యంచు నిరాశతో నరయుచునుండఁ
దళుకుతళుక్కను తనుకాంతితోడ
నెదుటఁగన్పడె నొక్కయింతి యాక్షణమె.

*   *   *   *   *

*   *   *   *   *

*   *   *   *   *

దూరాన మేడపై, గారాముమీర

విరిసెజ్జ

నాల్గవ యంతస్తునను గనంబడ్డ
యా చిగురుంబోడి, యా మోహనాంగి,
మొదటఁ గన్పడెనాకు మదముఁగొల్పుచును.

* * * * *

అరవిడినగులాబి యందంబువోలె
సహజమై యొప్పారె సతిచక్కఁదనము.
గాలి కాడకుకొమ్మ మేలిపాటట్లు
సహజమై యొప్పారె సతిపాడుపాట.
విరిసిన మల్లియవిరితావి రీతి
సహజమై యొప్పారె సతితేటమాట.
కపటమింతయులేదు ; కల్లయులేదు ;
తెచ్చిన యందంపుఁదీరును లేదు ;
తెచ్చిన మాటలతీరును లేదు ;
ముద్దుఁజూపులతోడ ముద్దులఁగూర్చి,
ముద్దుమాటలతోడ ముద్దులఁగొల్పి,
విరిసెజ్జచందాన వింతలంబొల్చె.
ఆయింతిపైని నాస్వాంతంబునిల్చె ;
చేసాఁపి యాయింతిఁ జెంతఁజేర్చితిని,
చేర్చితిఁ గౌఁగింటఁ జేర్చితి నంత

వి రి సె జ్జ

విరిసెజ్జపైఁ జేర్చి, మఱచితిఁదనువు.

*　*　*　*　*

*　*　*　*　*

*　*　*　*　*

*　*　*　*　*

విరిసెజ్జపై నిల్చి విరిబోణినైతి,
విరిబోణితోఁ గూడి విరిబోణినైతి,
విరిసెజ్జపై నేను విరిబోణినాచు
నద్వయానందంబు ననుభవించితిని.

*　*　*　*　*

దూరాన వెలుఁగులోఁ దోఁచియున్నట్టి
యామేడపైని మూఁడంతస్తులవల
నాల్గవయంతస్తునం గాంతఁగూడి
విరిసెజ్జపై నిల్చి, విరిబోణినాచు
నద్వయానందంబు నందుచునుంటి.

*　*　*　*　*

విరిబోణితోఁ గూడి విరిబోణినాచు
విరిసెజ్జపై నిల్చి విలసిల్లువేళ
నాల్గవయంతస్తునను గాదు నిల్చు
ఐదవయంతస్తునంది యుండుంటి.

విరిసెజ్జ

ఏమయియుంటినో యెఱుఁగను నేను,
నేను నేనై యున్న నెనరు కన్పట్టె.
ఎంత సేపుంటినో యెఱుఁగను నేను,
నేను నేనైన చందానఁ గన్పట్టె.

*   *   *   *   *

*   *   *   *   *

*   *   *   *   *

*   *   *   *   *

తెలివివచ్చెను; చుట్టుఁ దేరిచూచితిని,
విరిసెజ్జ చెంతనే యరయుచునుంటి.
నాల్గవయంతస్తునకుఁ గొనిపోయి,
యైదవయంతస్తునందు నన్నుంచి,
తలరించి, యులరించి, తలిరాకుఁబోణి,
మాయమైపోయినమాడ్కి నెంచుచును,
వెలవెలఁబాఱుచుఁ దలఁచుకొంచుంటి.

*   *   *   *   *

*   *   *   *   *

*   *   *   *   *

ఆకులుఁ జీఁకట్ల నరయుచునుండె,
చుక్కలుఁ, విరులును జూచుచునుండె,

గాలియుఁ గొమ్మలుఁ గనుఁగొనుచుండె,
విరిసెజ్జకడనేను వేచియుండితిని.

*　*　*　*　*

*　*　*　*　*

*　*　*　*　*

కనిపెట్టుకొనియుంటిఁ గాంతనుఁ జూడ.

*　*　*　*　*

*　*　*　*　*

*　*　*　*　*

*　*　*　*　*

కాంతఁ గాఁగిటఁజేర్చఁ గనిపెట్టుకొంటి.

విరిసెజ్జ

V

1. This my son was dead, and is alive again. He was lost and is found.
2. Except ye repent, ye shall all likewise perish.
3. Thy heart is not right in the sight of God. Repent, therefore, of this, thy wickedness, and pray God, if, perhaps, the thought of thine heart, may be forgiven thee, for, I perceive that thou art in the gall of bitterness and in the bond of inequity.

The Holy Bible.

*　　*　　*　　*　　*

ఆనందమునఁ దేలియాడుచునుంటి ;
ఆత్మేశ్వరింగూడి యంతంబులేని
యానందవార్ధి మున్గాడుచునుంటి ;

*　　*　　*　　*　　*

దినములు, కేలును, జనియె నెన్నెన్నొ,
యెన్నియేండ్లయ్యెనో యెఱుఁగనునేను ;

ఆనందమునఁ దేలియాడుచునుంటి,
ఆత్మేశ్వరింగూడి యంతంబులేని
యానందవార్ధి మున్గాడుచునుంటి ;

* * * * *

ముద్దుఁజూపులతోడ ముచ్చటల్గొల్పి,
ముద్దుమాటలతోడ మురిపెముల్గొల్పి,
ముద్దులమూటయై ప్రేమనిల్పుచును,
ముద్దులసుద్దుల మోహంబుగొల్పి,
యుల్లాసముద్దుగా నరయుచునున్న
యాత్మేశ్వరునిగూడి, యంతంబులేని
యానందవార్ధి మున్గాడుచునుంటి.

* * * * *

* * * * *

* * * * *

చైత్రమాసంబునఁ జిత్రమారీతిఁ
గ్రొత్తపూవులుపూఁచెఁ గ్రొమ్మావిగున్న ;
నిండుపున్నమనాఁటి పండువెన్నెలను
మావిగున్ననుజూడ మనసయ్యెనాకు.
అమృతంబుగ్రోలెడు నందాలకువ్వ,
నేరుపుల్ సూపెడు నెఱపాటకాఁడు,

తుమ్మెదనెయ్యెందు తోడఝు వచ్చె ;
క్రొమ్మావిగున్న కన్గొనుచు నిద్దఱము
నానందపారవశ్యమున మున్గితిమి.
విరికన్నెలకులోఁగి, సరసాలఁదోఁగి,
యాకుసందులదాఁగి, యమృతంబుఁద్రాగి,
యేజాడఁజూడఁ దానేయౌచు రేఁగి,
యాడుచుఁ బాడుచు, నానల్లనయ్య
విశ్వరూపముఁదాల్చి, వేడుకల్ సలిపె.
నిండుపున్నమనాఁటి పండువెన్నెలను,
విరికన్నియలతోడి సరసాలఁ గూడి,
పాడుచు, నాడుచుఁ బొఱలాడుచును,
విశ్వరూపముఁదాల్చి, వేడుకల్ సూపి,
యానల్లనయ్య నాకానందమిచ్చె ;
ఆనందమునఁ దన్మయంబయ్యె మనసు.

* * * * *

కొంటెతనమ్ముల కూర్మిచుట్టాలు,
గాలిపిల్లలు మావికడకేఁగుదెంచి
గంతులువైచుచుఁ బంతాలుమీరఁ
బైఁబడి హాస్యాలప్రభ చూపిరపుడు.
గాలిపిల్లలఁగూడి, మేలమ్ములాడి,

విరిసెజ్జ

వింతలతావులు వెనువెంటవచ్చె.
హాస్యాల మేళాల కలరెఁ జిత్రంబు.
తన్మయంబయ్యెఁ జిత్తంబంతనాకు.
అలరుగన్నియలతో నాటాడి యాడి,
తుమ్మెదద్రిమ్మరి యెమ్మెలుగ్రమ్మఁ
దావులేతెంచిన తావుల త్రోవఁ.
బరుగెత్తిపోసాగెఁ బాటఁబాడుచును. *
తుమ్మెదనెచ్చెలితోడ నేఁగూడఁ
బరుగెత్తుచుంటి, నబ్రము నొందుచుంటి.

*   *   *   *   *

దూరాన నొకయింటి తోఁచె మాయెదుట.
పొగడపూఁబొదరింటఁ బూఁబాన్పుపైని
దూరాన నొకయింటి తోఁచె మాయెదుట.

*   *   *   *   *

నాకన్నమున్నుగా నాదునెయ్యుండు
పరుగెత్తి, యాయింటిదరికి వేపోయి,
ఏకాంతముగఁ జెవి నేమేమొ చెప్పి,
మఱికనంబడకుండ మాయమైపోయె,
పొదరింటిదరిగాఁగఁ బోయితినేను.
కాని, నానెయ్యుండు కానరాఁడయ్యె.

విరిసెజ్జ

ఎదుటఁగన్పడుచున్న యింతినిఁజూచి,
యింద్రియంబులవెల్ల నింపునంబొల్చె.

* * * * *

చూపులలోనుండి సొగియించుపాట
చెవులకానందంబు సేయుచునుండె.
చెవులతీరుననుండి యిపుడించుతళ్కు
కనులకానందంబు కలిగించుచుండె.
మోముతేఁటలనుండి పొలుపారుతీపు
నాల్కకానందంబు చిల్కుచునుండె.
ముక్కుసోయగమున మొనయుసూర్ద్రవము,
తనువునకానందమును గూర్చుచుండె.
తనువుచాయలనుండి చనుదెంచుతావి
ముక్కునకానందమును గూర్చుచుండె.
ఆయంద మాచంద మరయమునుండ,
నింద్రియంబులవెల్ల నేకమ్మయుండె;
తనువెల్లఁగనులయి కనుఁగొనుచుంటి.
తనువెల్లఁగనులయి తనుఁజూచుచున్న
ననుఁజూచి, ముసిముసి నవ్వె నాయింతి.
నవ్వుచు నిలుచుండి, ననుఁజేరవచ్చె;
చేసాపి, కౌఁగిటఁ జేర్చెను నన్ను;

అలరుఁబానుపుఁజేర్చి యలరించెనన్ను;
ఎందునేనుంటినో యెఱుఁగలేనైతి,
ఏమియైయుంటినో యెఱుఁగలేనైతి.

*   *   *   *   *

*   *   *   *   *

ఏకచిత్తంబున నింతితోఁ గూడి,
యానందరూపుండనై వెల్గుచుంటి.
చైత్రంపుమాసానఁ జిత్రంపురీతి,
నిండుపున్నమనాఁటి పండువెన్నెలను,
పూఁబొదరింటిలోఁ బూపుఁబాన్పునను,
పూఁబోణితోఁ గూడి, పోడుముల్ సలిపి,
ననునేనెమఱచి, యానందంపుఁగడలి
మునుఁగుచుఁ దేలుచు, మునుఁగుచునుంటి.
పిలిచినరీతిగాఁ బలుకుచునుండి,
చెప్పినపనులెల్లఁ జేయుచునుండి,
నిలుచుచుఁ గనుసన్న మెలఁగుచునుండి,
యడిగినదంతయు నందిచ్చుచుండి,
తనకు నాకన్న వేఱను మాటలేక,
తానె నేనయి, నేనె తానయినట్లు
భేదమింతయులేని ప్రీతిఁజూపుచును,

పూఁబోదరింట నిర్వ్యరము నిల్చితిమి.
ఇంటినిమఱచియు, నిల్లాలిమఱచి,
అంతయునింతియే యైనచందాన
నాపూవుటోరంబునందు నిల్చితిని.
ఆనందమునఁ దన్మయుంబయ్యె మనసు,
మనసార నింతి నక్కునఁ జేర్చికొంటి.
ఇంతియక్కునఁ జేరి యిమిడినేనుంటి,
నిలిచితినక్కున, నిదురఁ జొక్కితిని,
ముదమునఁ జొక్కితి, నిదురఁ జిక్కితిని.
మఱచితిలోకంబు, మఱచితిఁ దనువు,
ననునేనెమఱచి యానందమందితిని.
ఎంతసేపయ్యెనో యెఱుఁగను నేను,
ఎన్నినాళ్లయ్యెనో యెఱుఁగలేనైతి.
ఎదపైని జేవైచి, నిదురపోయితిని.

*　　*　　*　　*　　*

*　　*　　*　　*　　*

*　　*　　*　　*　　*

కలవచ్చె నంతలోఁ, గాలుచున్నట్లు,
తెలివివచ్చె, భయంబుగలిగ నెమ్మదిని.
గడగడవడకితిఁ; గదలలేనైతి.

అటునిటు చూచితి ; అడలుచునుంటి.
కౌఁగిటిలోఁ గాంతకనఁబడదయ్యె ;
పొగడపూఁబొదరిల్లు పోయె నెయ్యెడకో.
పడియుంటి నిసుకఁ బూఁబాన్పనంగాదు.
మట్టమధ్యాహ్నన, పట్టెయెడారిఁ
బట్టబైటను నేను బడియుంటినిసుకఁ;
గాలినయిసుకపైఁ గదలుచునుంటి;
గడగడవడఁకుచుఁ గదలలేకుంటి;
వేఁడిగాలులు మీఁద వీఁచుచునుండె;
ఎండచే నొడలెల్ల మండుచునుండె.

*   *   *   *   *

*   *   *   *   *

*   *   *   *   *

పేర్వెట్టి యింతిని బిలువనెంచితిని;
పేరెఱుంగను, దాని యూరునెఱుంగ;
ఏమనిపిలుచుటో యెఱుఁగకయుంటి,
ఏమనియఱచుటో యెఱుఁగలేనైతి.
"ఇంతిరో" యనిపిల్వ నెంచితిఁగాని,
మాటయొక్కటియైన నోటరాదయ్యె.
కాంతనన్నుఁ బరీక్ష గావింపఁబోలుఁ

గాకున్న నీరీతి కఠినత్వమున్న?
కలికిఁజూపులు లేవు కనుసెవ్వువేళ :
మొలకమాటలు లేవు మురినొవ్వువేళ ;
మురివేళ, కతవేళ, సరసాలవేళ,
మొలకగాలే పింపక లకిగాలేదు:
కారణంబేమి యీగాకఠినత్వమునకు?
వచ్చు వైళము వచ్చు, వచ్చి నన్‌జూచు,
వచ్చు నాకానందమిచ్చును మెచ్చు;
ననుచు నించుక నేపు మనసుందుఁ దలఁచి,
యూరటచెందితి, నువ్విళ్ళులూరి——
కాని, వచ్చెదుజాడ కనఁబడదయ్యె,
వచ్చి కన్పుజాడ పనుపడదయ్యె.

*   *   *   *   *

నామాట వినువారు, ననుఁజూచువారు,
నామొఱాలించువా రేమూలనెవరుఁ
గనుపట్ట రేమిచేయను దోఁచదయ్యె.
వేఁడినిట్టూర్పులు విడిచెనుబయలు,
ననుఁజూచి జాలిఁజెందినదేమొ బయలు;
మోమున నల్లని ముసుఁగిడె బయలు;
ననుఁజూచి జాలిఁజెందినదేమొ బయలు;

వి రి సె జ్జ

కనులనీ రింతింతఁగార్చెను బయలు,
ననుఁజూచి జాలిఁ జెందినదేమొ బయలు;
బయలిజాలినిజూచి, భయమింతతగ్గ.
లేవంగఁజాలితి, లేచి నిల్చుంటి ;
అడుగిడఁజాలితి, నటుపోవుచుంటి,
ఎటుపోవుచుంటినో యెఱుఁగను నేను.
దవ్వుదవ్వుల సముద్రంబు కన్పడియె.
తకతక కెరటాలు తాండవంబాడె—
ఆకాశమంత మేఘావృతంబయ్యె,
అంధకారము కప్పె నన్నిదిక్కులను ;
ప్రళయజంఝానిలప్రబల వేగమునఁ
దారంగ తాండవధ్వని మిన్నుముట్టె.

*　*　*　*　*

ఎటుచూడదిక్కులే దెందు నేఁబోదు !
ఎటు వేడదిక్కులే దెందునే నుందు !
ఏమిచేయఁగనౌనొ యెఱుకలేదయ్యె,
ఎట్లునిల్వఁగనౌనొ యెఱుకలేదయ్యె.

*　*　*　*　*

క్రమ్మినచీఁకట్లు క్రమ్మినట్లుండె,
కప్పినమేఘాలు కప్పినట్లుండె,

పడుచున్న చినుకులు పడుచునేయుండె,
ఏఁచుగాలులతోటి లేచు కెరటాలు
పొంగి మీఁదికిఁ బొర్లిపొర్లి పడుచుండె ;
ననుముంచి లోనికీడ్చునొ తరంగాలు,
ననుఁద్రోసి మీఁదికెత్తునొ గాలి——

* * * * *

ఏమిచేయఁగ నౌనొ యెఱుఁగ లేదయ్యొ,
ఏమనుకొన నౌనొ యెఱుఁగ లేదయ్యొ ;
ఏడుపులోఁ గొంతతృప్తి కన్పట్టె.
మనసారఁగా నేడ్వ మనసుజనించె,
కనువారు వినువారు కనరానికతన,
అఱచితి గట్టిగా నఱచుచునుంటి.

* * * * *

గాలితోఁబోయి, మేఘాలతోఁ గలసి,
కెరటాలతోఁబోయి, యురులతోఁ గలసి,
నిట్టూర్పు గాలిలో నిండఁగాఁ జేసి,
కన్నీళ్లు కెరటాలఁ గలయఁగాఁ జేసి,
యేడ్చెద మనసార నేడ్చుచుండెదను.
కెరటాలతుంపురుల్ కెలనికివచ్చి,
కారుచీఁకటివచ్చి చేరువనిల్చి,

మేఘాలచినుకులు మేనిపైఁజరచి,
ననుఁబరామర్శింప * * * *
* * * * *

వలదు వెన్నెలనాకు, వలదుచుక్కలును,
వేగుఁజుక్కనుజూచు వేళయువలదు ;
ఇరులతోఁ దరగతుంపురులతోఁ గలసి,
మొరయుచిన్కులఁగూడి మొఱపెట్టుకొంచు,
ఏడ్చెద—ఏడ్చెద—ఏడ్చుచుండెదను.
చీఁకటినెయ్యుండు చెంతఁ గూర్చుండి
ముచ్చటలాడుచు మురియుచునుండ,
వలిగాలిచుట్టంబు చెలిమితోవచ్చి,
యరలేనికూరిమి నరయుచునిలువఁ
గారుమబ్బుపడంతి కన్నీరునించి
జాలిగొల్పుచుఁ జేరి సందిటనిముడ
మన్నుమిన్నేకమై మలయుచందాన
దుఃఖంబు లోనుండి దుముకుచునుండ,
నిచ్చకువచ్చిన ట్లేడ్చుకొంటాను.—
ఓదార్చువారు లేకున్నకతాన,
ఏడ్చినమాత్రనే తృప్తినిగంటి—
ఓదార్పు నాకేల, యోర్పునాకేల,

వెన్నెలనాకేల, వెలుగునాకేల
నాకేలతారలు, నాకేలతరణి,
చెలికాఁడుచీఁకటి చెదరిచూడంగ
వలిగాలిచుట్టంబు కలఁగిచూడంగ,
మబ్బుతోఁ గాలంపుమల యెక్కుతాను,
కాలంపువెల్లువఁ గలసి—పోతాను, *
కాలమై కాలానఁగలసిపోతాను.
గాలి—చీఁకటి—మబ్బు—

*   *   *   *   *

*   *   *   *   *

*   *   *   *   *

ఎదుటనున్న సముద్రము వీక్షించుచుంటి ;
గాలివానకుఁ జిక్కి కనువారులేక,
ననుఁబోలె నేడ్చుచున్నవితానఁ దోఁచె.
ఏడ్చువారినిఁగూడి యేడ్చెడువారు
కనుపట్టఁ గలుగదే మనసుకుఁదృప్తి?—
ఇరువురమైతిమి—ఏను, సంద్రంబు—
ఆసముద్రంబుతో నంటి నీరీతి:
"మొదలుతుదయును లేక, మొనసిచీఁకట్లు
నినుఁగప్పెసంద్రమా, ననుఁబోలెనిపుడు :

పొంగి, పైకుబుకుచుఁ బొర్లుచువచ్చి,
దుఃఖంపుఁగెరటాలు తూలుచునుండ,
నిట్టూర్పుగాలులు నిగుడఁజేయుచును,
ననుఁబోలె నేడ్చుచున్నావొకో నీవు ?
చూడఁజుట్టములేక స్రుక్కుచునుండి,
మ్రొక్కదైవములేక మొరయుచునిలిచి,
కనువారు, వినువారు కనుపట్టకుండ,
ననుఁబోలె నొంటినున్నావె యీవేళ ?
ఇదియె మేలిదియె మేలిదె మేలునుమ్మ,
మనసారఁగానేడ్చి తనివొందనగును.
నిన్ను నేనును, నన్ను నీవు నోదార్చి
కొనుచుఁ గాలముఁద్రోసికొనుచు నుందాము.*
సంద్రంబు ననుఁజూచి జాలిని జెందె,
సంద్రంబుఁ జూచి నేజాలిఁజెందితిని.
ననుఁగౌఁగిలింపసంద్రంబు తలంచె,
నేనుసంద్రముఁ గౌఁగిలింప నెంచితిని.
వెలిగాలివాన, లోపలిగాలివాన,
యొక్కరీతిగఁగ్రమ్మి యొనరించెభయము.
వార్ధితోనీరీతిఁ బలికితిమరల—
గాలిమెండయ్యె, మేఘాలునిండయ్యె,

వాన తొండాలతోఁ బైఁబడుచుండె.
నీకు శక్యముకాదు నాకడనిలువ,
నాకు శక్యముకాదు నీకడనిలువ ;
నీవు నాలోఁజొచ్చి నిలువవచ్చెదవో,
నేను నీలోఁజొచ్చి నిలువవచ్చెదనో,
...........................వద్దు,
* * * నీవు నాలోనఁ గలయఁగావద్దు—
నీవు నాయెదలోన నిలువఁగా లేవు ;
కన్నీళ్లరూపానఁగరఁగి, యుప్పొంగి,
పాటుతోఁ బోటుతోఁ బైకివస్తావు.
వ్యర్థమే యదిసుమ్మి, వ్యర్థమే నిజము.
నేను నీలోఁజొచ్చి నిలువఁగలైదను.
నీకసాధ్యము నన్నుఁ బైకిఁద్రోయంగ.
నేను నీలోఁజొచ్చి నిలువ, నిద్దఱము
దివ్యస్వరూపాలఁ దేజరిల్లెదము.
ప్రళయమయ్యదియౌను—ప్రళయమే—యౌను.
ప్రళయాన యోగనిద్రను దేలియాడి
నీయందునిల్చు నారాయణునట్లు
నేనునీలోనిల్వ, నీకునునాకు
నన్యోన్యవై భవం బమరునుజుమ్మి.”

సంద్రంబునాపైని జాలిని జెందె,
తరఁగలచేతుల బిరబిరఁబిలిచెఁ *
దరఁగలచేతుల బిరబిరఁజాపె.

* * * * *

ఆశయంతయునింకె, నడలుజనించె,

* * * * *

దరిదాపుగనరాదు, తడవేలనింక,
ఇదిగో నీలోఁజొత్తు నేను, ననుగొనుము.''
పిలుచు మున్నీటిని బలుకరించితిని.
రాలుకన్నీటఁ దర్పణములిచ్చితిని.
మున్నీటికౌఁగింట మునఁగఁజొచ్చితిని.
కన్నీటికాలువల్ కార్పఁజొచ్చితిని.
మున్నీరుజాలిచే నన్నాదరించె,
కన్నీరుజాలిచే మున్నీటఁబెంచె ;
కన్నీరు మున్నీరు నన్నావరించె,
కన్నీరు మున్నీటికౌఁగిటంజేర్చె.
మున్నీటికౌఁగింట మునుఁగుచునుంటి,
తరగచేసాపి సంద్రము నన్నుఁబట్టె.
ననుఁబట్టిమీఁదికెత్తెను సముద్రంబు.
మింటఁదళుక్కను మెఱపొందుమెఱసె.

విరిసెజ్జ

తరగచేతుల సముద్రము నన్నుఁబట్టి
యొడ్డుకువిసరినయొప్పు కన్పట్టె.
విసరినననుబట్టి విసవిసనెవరో
కౌఁగింటఁబెట్టినకరణిఁగన్పట్టె.
విరిసెనుమేఘాలు, వెలిసెనువాన,
వెన్నెల యంతటవిలసిల్లుచుండె ;
చిఱుగాలిలాస్యంబు సేయుచునుండె,
కెరటాలునృత్యంబు జరిపించుచుండె,
ఇసుకతిన్నియపైని నింతికౌఁగింటఁ
గూర్చుంటి—చిత్తంబుకుదుటనుబడియె.
స్పర్శలోవింతకన్పట్టుచునుండె,
వెనుకకుఁదిరిగి మోమును గనుంగొంటి—
కాని, మోమునువంచి కాంచితిసిగ్గు.
పొగడపూఁబొదరింటి పొలఁతికాదదియు,
వెన్నెలలోఁగాంత వింతగాఁదోఁచె.
ప్రాఁతవింతలు క్రొత్తరీతిఁబెంపారె.
కౌఁగింటిలో ముద్దు కనఁబడుచుండె.
చూపులలో ముద్దు సొగయుచునుండె.
గడగడవడకితిఁ గాంచితిసిగ్గు,
గడగడలాడితిఁ గంటినిభయము.

కౌఁగిలితప్పించి, కాంతపాదములు
పట్టితి,—పట్టితి—పట్టితిమరల.
అపరాధి నపరాధి నపరాధి నైతి
అపరాధినైతి నన్నాదరింపకుము.—
కన్నీటఁ బాదాలు కడుగుచునుంటి,
అపరాధి నపరాధి నపరాధినంటి.
ఆత్మేశ్వరీ నీకు నపరాధినైతి ;
నేప్రేమ గుర్తింపనేరక యుంటి,
నీమహాత్త్వ మెఱుంగనేరక యుంటి.
బైటిరంగులకు నే భ్రమలఁ జెందితిని,
బైటితీవులకు నబ్బంబు నందితిని,
నీముద్దు నీసుద్దు నేమరిపోతి,
నిన్ను నేమరచితి, నినుజూడకుంటి,
తలపకయుంటి డెందమునందు నిన్ను
నీకగ్గుచేసితి, నీచుండ నేను.
నీపాదసేవకు నేఁదగనింక,
నీయింటిబంటనై నేనిల్చునట్లు,
నీసేవకులసేవ నేఁజేయునట్లు,
వరమిమ్ము, నాతప్పు లరయకుమింక,
నీదుపాదములంటఁగాదు నాకింక;

చేసితిపాపంబు; చేసెద సేవ;
నీసేవకుల సేవచేసి పాపంబు
తొలఁగించుకొందు నన్ద్రోసిపుచ్చకుము.

*   *   *   *   *

తలవంచి చేమోడ్చి నిలిచితి నెదాట,
కన్నీటఁ బాదాలు కడుగుచునుంటి ;
చేసాపి కౌఁగింటఁ జేర్చ్చనన్ గాంక;
కాంతకౌఁగిట నన్ను గదియించినిల్చె.
ఏలవిచారింతు విట్లుప్రాణేశ,
వంతనీకేటికి వలదింక వినుము.
ననునీవు విడనాడియునికి నిజమ్మొ,
నినునేను విడనాడియునికి లేదెపుడు.
నినుఁగనిపెట్టుకొంటిని, వెంటనంటి
నినువిడనాడక, నీమ్రోలనుంటి;
నీకష్టముల నేను నిలిచికంచుంటి
నీమొఱలన్నియు నిల్చివించుంటి,
నీతోడఁ బలుకాడనేరకయుంటి,
నీకుఁ గన్పట్టఁగానేరకయుంటి,
కాని నీవెనువెంట నేనంటియుంటి.
అకట, పశ్చాత్తాపమైనయందాక

నీతోడఁ బలుకాడ నేర్పులేదయ్యె,
నీకుఁ గన్పట్టఁగా నేర్పులేదయ్యె.
కాలంబె కలయంగఁ గారణంబౌను,
కాలంబె విడిపోవఁ గారణమౌను.
కాలంబె విడఁజేసె; కాలంబె కలిపె;
వగపేలఁ గాలంపుఁబనికి నీకిపుడు!
నిన్నుఁ గాపాడంగ నేవేచియుంటి,
నిన్ను మన్నింపంగ నేఁగోరియుంటి,
నీపైని గూరిమి నిండారు నాకు,
నిండారు ప్రేమతో నేనిన్నుఁజూతు
నేనెనీవనుకొమ్మ నీవె నేననుము
ఏనును నీవొక్కటే యనుకొనుము.
నీవు నాకౌఁగింట నిలువుమీ వేళ,
నిన్ను నేనరయుచు నిలుతు నే వేళ."
అనుచు నీరీతి నన్ననునయించుచును,
చేయి చేఁబట్టుచుఁ జిఱునవ్వనగుచు,
నింటికిఁగొనిపోయి యింపుగావించె.
ఇంటిపట్టుకుఁబోయి, యింపునంబొదలి
యాత్మేశ్వరింగూడి హాయిఁజెందితిని.

*　　*　　*　　*　　*

నడుమవచ్చినగొప్ప నడుమనేపోయె
నాత్మేశ్వరినిగొల్చుటది నాకుమిగిలె,
ఆత్మేశ్వరినిగొల్చి యలరుచునుంటి,
ఆనందమునఁ దేలియాడుచునుంటి.

*　　　*　　　*　　　*　　　*

ఆనందమునఁ దేలియాడుచునుంటి,
నాత్మేశ్వరింగొల్చి యంతంబులేని
యానందవార్ధి మున్గాడుచునుంటి;
ముద్దుజూపులతోడ ముచ్చటల్గొల్చి,
ముద్దుమాటలతోడ మురిపెముల్గొల్చి
ముద్దులమూటయై మ్రోలనిల్చుచును,
ముద్దులసుద్దుల మోహంబుగొల్చి,
యల్లారుముద్దుగా నరయుచున్న
యాత్మేశ్వరింగొల్చి, యంతంబులేని
యానందవార్ధి మున్గాడుచునుంటి,
నానందమునఁ దేలియాడుచునుంటి.

*　　　*　　　*　　　*　　　*

*　　　*　　　*　　　*　　　*

*　　　*　　　*　　　*　　　*